ప్రజాశక్తి

సోమవారం 25 మార్చి, 2024

5

శ్రీకాకుళం



27న జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 27న జరగనున్నాయని ఎన్నికల అధికారి కె.నాగభూషనరావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నామినేషన్ల ఉప సంహరణ అనంతరం అధ్యక్ష పదవికి కె.ఈశ్వరరావు, కూన రాజారావు, ఎన్ని సూర్యారావు, కార్యదర్శి పదవికి మోతూరు భవానీప్రసాద్, పీస చంద్రశేఖర్ పోటీలో ఉన్నట్లు చెప్పారు. ఆ రెండు పదవులకే ఎన్నిక నిర్వహించనున్నామని, మిగిలిన ఏకగ్రీవమైనట్లు స్పష్టం చేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా మరిచెర్ల అన్నంనాయుడు, ప్రధాన కార్యదర్శిగా యగళ్ల ప్రసన్నకుమార్, కోశాధికారిగా విరోధి శ్రీనివాసరావు, గ్రంథాలయ కార్యదర్శిగా పాతిన రామారావు, క్రీడా కార్యదర్శిగా కారి అప్పారావు, మహిళా ప్రతినిధి ధవళ అమృత ఎన్నికట్లు వెల్లడించారు.



దాహం.. దాహం

- ముస్సిపాలిటీలో అడుగంటిన భూగర్భ జలాలు
- 50 శాతం మాత్రమే తాగునీరు సరఫరా
- మరమ్మతులకు నోచుకోని బోర్లు, పవర్ బోర్లు
- సొంత డబ్బులతో నీటిని కొనుగోలు చేస్తున్న ప్రజలు

జిల్లాలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఒకటి. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ విభాగాల నుంచి ఏడాదికి సుమారు రూ.8 కోట్లు ఆదాయం వస్తున్నా... ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. భూగర్భ జలాలు అడుగంటిపోవడం, పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా చేయడంలో పాలకవర్గం విఫలం కావడంతో పట్టణ ప్రజలకు తాగునీటి కోసం తిప్పలు తప్పడం లేదు. కొన్ని ప్రాంతాల్లో రూ. 800లు ఇచ్చి నీటి ట్యాంకును కొనుగోలు చేస్తున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మూడు అంకెల్లో బోర్లు, పవర్ బోర్లు ఉన్నాయే తప్ప ప్రజలకు తాగునీరు అందించలేని పరిస్థితి.

ప్రజాశక్తి- పలాస



మూలకు చేరిన వాటర్ ట్యాంకు

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 31 వార్డుల్లో సుమారు 63, 400 జనాభా నివసిస్తున్నారు. పట్టణంలో సుమారు 185 హ్యాండ్ బోర్లు, 135 పవర్ బోర్లు, ఐదు నేల బావుల నుంచి కుళాయి పైపులైన్ ద్వారా పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. వాస్తవానికి నేల బావులు అడుగంటి పోయాయి. కేవలం రెండు బావులు, బోరు నుంచి అరకొరగా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి వ్యక్తికీ రోజుకు 135 లీటర్లు నీరు అవసరం. ఆ లెక్క ప్రకారం పట్టణంలో నివాసం ఉంటున్న ప్రతిఒక్కరికీ రోజుకు సుమారుగా 85.59 లక్షల లీటర్లు నీరు అవసరం. సాధారణ సమయాల్లోనే ఆ స్థాయిలో నీరు అవసరమై తే వేసవిలో అంతకుమించి నీటి అవసరం ఉంటుంది. కానీ, ఆ స్థాయిలో మున్సిపల్ అధికారులు నీటిని సరఫరా చేయలేకపోతు న్నారు. దీంతో పట్టణ ప్రజలు తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నా రు. అధికారులు మాత్రం పట్టణ ప్రజలకు సుమారుగా 30 లక్షల లీటర్లు నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నామని చెబుతుండడం గమనార్హం.

నీటి ఎద్దడి ప్రాంతాలు ఇవే...

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఎక్కువగా పలాస బత్తుల వీధి, పెద్దవీధి, కంచర వీధి, అన్నపూర్ణ ఆశ్రమం, గోరువీధి, హట్కో కాలనీ, రామలక్ష్మణ కాలనీ, హరిజన వీధి, ఉదయపురం, రాజాం కాలనీ, ఉల్లాస పేట, కాశీబుగ్గ డెంకి వీధి, పల్లి వీధి, న్యూ కాలనీ, నెహ్రూ నగర్, శాంతినగర్ నెహ్రూ నగర్, శ్రీనివాస నగర్, లలితా నగర్, లేబర్ కాలనీ, పద్మనాభపురం తదితర ప్రాంతాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. సాధారణ సమయంలో కాకుండా వేసవి కాలంలో నీటి ఎద్దడి మరింత తీవ్రంగా ఉంటుంది. కానీ, ఆ ప్రాంత ప్రజలకు సకాలంలో కుళాయి నీరు సరఫరా చేయకపోగా ట్యాంకులతో అరకొరగా నీటిని సరఫరా చేయడంతో ప్రజలు తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపాలిటీలో పది రోజులకు ఒకసారి మున్సిపాలిటీ కుళాయి నీటిని సరఫరా చేస్తే ఏలా అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పలాస ప్రాంతాల్లో రాజాం కాలనీ, హారిజన వీధి, రామలక్ష్మణ కాలనీ, మున్సిపల్ కార్యాలయం వీధి తదితర ప్రాంతాల్లో పది మంది చొప్పున నీటి ట్యాంకును రూ.800లకు కొనుగోలు చేసుకుంటున్నారు. కొనుగోలు చేసిన నీటిని దాచుకొనేందుకు ప్లాస్టిక్ డ్రమ్ము రోజుకు రూ.30లు చొప్పున అద్దెకు తెచ్చుకుంటున్నామని మహిళలు చెబుతున్నారు.



ట్యాంక్ ద్వారా నీటిని పడుతున్న మహిళలు

మరమ్మతులకు నోచుకోని బోర్లు

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 185 బోర్లు ఉన్నప్పటికీ చాలా వరకు మరమ్మతులకు గురయ్యాయి. చాలా ప్రాంతాల్లో బోర్లు మరమ్మతులు చేపట్టకపోవడంతో నిరుపయోగంగా పడి ఉన్నాయి. పవర్ బోర్లు 135 ఉన్న ఆ స్థాయిలో బోర్లు పనిచేయడం లేదన్న వాదన ప్రజల నుంచి గట్టిగా వినిపిస్తుంది. పద్మనాభపురం పలాస పెద్దవీధి, కాశీబుగ్గ తిలక్‌నగర్, తాళభద్ర తదితర ప్రాంతాల్లో పవర్ బోర్లు పాడైన మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక మహిళలు చెబుతున్నారు. బాగు చేయాలని పదే పదే అధికారులకు చెబుతున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలాస ఇందిరానగర్‌లో బోరు తవ్వి అలాగే విడిచిపెట్టారు. పలాస బత్తుల వీధి సమీపంలో పవర్ బోర్ పాడైందని మున్సిపల్ అధికారుల దీష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోయిందని అక్కడ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అడుగంటిన బావి



మూలకు చేరిన బోరు

పది శాతం కూడా కాని నీటి పథకం పనులు

మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని మున్సిపల్ అధికారులు ఎఐఐబి పథకం కింద రూ.వంద కోట్ల వ్యయంతో తాగునీటి పథకం ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. కానీ, కేవలం పది శాతం పనులు కూడా జరగడం లేదు. కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి నుంచి పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు, లేబర్ కాలనీ, శివాజీ నగర్, సూదికొండ తదితర ప్రాంతాల్లో గోతులు తవ్వి పైప్‌లైన్లు వేసి చేతులు దులుపుకున్నారు. వాస్తవానికి ఫేజ్-1లో పలాస మండలం రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయరు నుంచి నీటిని మున్సిపాలిటీకి తరలించి అక్కడ నుంచి పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. కానీ, ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులు పూర్తి కాకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. మున్సిపాలిటీ పరిధిలోని అన్నీ వీధుల్లో పైప్‌లైన్లు వేసేందుకు పైపులు తెచ్చి పెట్టి అలాగే విడిచి పెట్టారు. ఏదీఏమైనా ఒక వైపు తాగునీటి పథకం పనులు జరగకపోగా, మరోవైపు నేల బావులు అడుగంటిపోవడం, పాడైన పవర్ బోర్లు, హేండ్ బోర్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పట్టణ ప్రజలకు తాగునీరు కష్టాలు వెంటాడుతున్నాయి. తాగునీరు సరఫరా కోసం ప్రత్యామ్నాయం చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుళాయి నీరు రావడం లేదు



మున్సిపాలిటీ కుళాయి నీరు పూర్తి స్థాయిలో సరఫరా కావడం లేదు. బోర్లు, పవర్ బోర్లు పాడైన బాగు చేయడం లేదు. తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ట్యాంకుల ద్వారా నీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేయడం లేదు. అమ్మవారి ఆలయం వద్ద బోరు వేసి అలాగే విడిచి పెట్టారు. తాగునీటి సమస్య రోజుకో గండంలా తయారైంది.

- కొత్తకోట లక్ష్మి, ఇందిరా నగర్, పలాస

నీటిని కొనుక్కుంటున్నారు



మున్సిపల్ కార్యాలయం వీధి, రాజాం కాలనీ ప్రాంతాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అరకొరగా ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నీరు కోసం సొంత డబ్బులతో కొనుగోలు చేసుకుంటున్నారు. పది మంది చొప్పున నీటి ట్యాంకును రూ. 800లకు కొనుగోలు చేసి సర్దుకుంటున్నారు. ప్రతి మున్సిపల్ సమావేశంలోనూ తాగునీటి సమస్యపై ప్రస్తావించినా ఫలితం లేకపోతుంది.

- జోగ త్రివేణి, కౌన్సిలర్

ట్యాంకులతో నీరు సరఫరా

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో నీటి ఎద్దడి ఉందని అధికారులు గుర్తించి రెండు మున్సిపల్ ట్యాంకులు, నాలుగు ప్రయివేట్ ట్యాంకులతో రోజుకు 30 ట్యాంకులతో నీటిని సరఫరా చేస్తున్నాం. రెండు రోజులకు ఒకసారి పైపులైన్ ద్వారా ఒక రోజు కాశీబుగ్గ, మరుసటి రోజు పలాసకు నీటిని సరఫరా చేస్తున్నాం. మరో రెండు రోజుల్లో అదనంగా మరో మూడు ట్యాంకులను పెట్టి నీటిని సరఫరా చేస్తాం. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గుర్తించి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. **- టి.నాగేంద్ర కుమార్, మున్సిపల్ కమిషనర్**



'మన ఉద్యమ నిర్మాతలు అనే' అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బాలసుబ్రహ్మణ్యం, తదితరులు

విద్యా రంగంలో లౌకక భావజాలం అవసరం

మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యారంగంలోని లౌకిక భావజాం అవసరమని, విద్య అందరికీ అందుబాటులో ఉండేలా రూపొందించాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. నగరంలోని అంబేద్కర్ కళా వేదికలో అప్పారి వెంకటస్వామి 23వ వర్ధంతి సందర్భంగా విద్యారంగం-లౌకిక భావజాలం అనే అంశంపై సదస్సు ఆదివారం నిర్వహించారు. సమాజంలో ఉత్పత్తి క్రమం ప్రారంభించి 12 వేల సంవత్సరాలు మాత్రమే అయిందని, ఈ కాలంలో అనేక రకాలైన ఆవిష్కరణలు జరిగాయని పేర్కొన్నారు. దేశంలోని భారత జాతి ఏకం చేసిన పెద్ద పోరాటం స్వతంత్ర్య పోరాటమని, ఈ పోరాటానికి నాయకత్వం వహించిన అందరిని స్మరించుకోవాలని సూచించారు. దేశ పునాదిలోనే లౌకిక స్వభావం ఉందని, అందువల్ల విద్య మొత్తం లౌకికంగానే ఉండాలని అన్నారు. జ్యోతిరావుపూలే, రాజా రామ్మోహన్‌రాయ్, కందుకూరి వీరేశలింగం, జిడ్డు కృష్ణమూర్తి, గాంధీ, గోపాలకృష్ణ గోకులే, అంబేద్కరు, నెహ్రూ లాంటి వారంతా దేశంలో విద్య అందరికీ అందుబాటులో ఉండాలని, సమానత్వ భావన పెంపొందించాలని కోరుకున్నారని గుర్తుచేశారు. శాస్త్రీయ, లౌకిక విద్య భారతదేశ పునాదులను రక్షించుకునేందుకు దోహదపడుతుందన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సామాజిక అవగాహన కలిగి ఉండాలని, నిరంతరం అధ్యయనం చేస్తూ ఉండాలని అన్నారు. ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణకు కృషి చేయాలన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరావు మాట్లాడుతూ యుటిఎఫ్ ఉద్యమాన్ని ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ వికాసం కోసం తీర్చిదిద్దుటల్లో క్రియాశీలకమైన పాత్ర అప్పారి వెంకటస్వామి పోషించారని కొనియాడారు విద్యారంగం ద్వారానే ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నం చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునే ఉపాధ్యాయులు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, బి.కె.ఎస్.ఎస్.ప్రసాద్‌లు మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న యుటిఎఫ్ చారిత్రాత్మక నేపథ్యంలో ఏర్పడిందన్నారు. సదస్సులో పూర్వ రాష్ట్ర కార్యదర్శులు బొడ్డేపల్లి మోహనరావు, జి.గిరిధర్, ఎం.వాగ్దేవి, చౌదర రవీంద్ర పాల్గొన్నారు. అనంతరం 'మన ఉద్యమ నిర్మాతలు అనే' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

అచ్చెన్న వల్లే టిక్కెట్ రాలేదు

మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గుండ కుటుంబంపై టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు కక్ష కట్టడం వల్లే ఎమ్మెల్యే టిక్కెట్ రాలేదని మాజీ మంత్రి, సీనియర్ నాయకులు గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆరోపించారు. నగరంలోని అరసవల్లిలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు టిడిపి కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సిఎం చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమం పరుగులు తీయిస్తారనే విషయంలో మనకు ఎటువంటి సందేహాలు లేవని అన్నారు. ఎన్‌టిఆర్ నుంచి ప్రస్తుతం చంద్రబాబు నాయకత్వంలో 40 ఏళ్లకు పైగా క్రమశిక్షణతో పార్టీ కార్యక్రమాలు అందరితో కలిసికట్టుగా చేపడుతూ పార్టీ నిర్మాణంలో భాగస్వాములమయ్యాని తెలిపారు. సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్నా... అవినీతి మరకలేని విధంగా పనిచేశానని అన్నారు. పార్టీ గొడుగులో స్వంత ఆర్థిక ప్రయోజనం కోసం గాని, వ్యక్తిగత ఎజెండాల కోసం గాని లేకుండా గడిపామని స్పష్టం చేశారు. అయితే రెండేళ్ల నుంచి అచ్చెన్నాయుడు సహకారం ఉండేదని, పార్టీలో కొందరు మనందరిపై తిరుగుబాటు చర్యలు చేపట్టడం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునని, ఇది దాయలేని నిజమని అన్నారు. పార్టీలో గ్రూపుల విషయం అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లామని, అయినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. అచ్చెన్నాయుడు అసమ్మతివాదులను ప్రోత్సహించి తనకు టిక్కెట్టు రానీయకుండా అడ్డుకున్నారని అన్నారు.

చందాలు వేసుకునైనా గెలిపించుకుంటాం..

టిడిపి నాయకత్వం మోసపూరితంగా వ్యవహరించిందని, అందువల్ల ఇండిపెండెంట్ అభ్యర్థిగా లక్ష్మీదేవి బరిలోకి దిగితే చందాలు వేసుకునైనా గెలిపించుకుంటామని నియోజకవర్గంలో వివిధ గ్రామాల నుంచి నగరంలోని వార్డుల్లో నుంచి వచ్చిన కార్యకర్తలు పేర్కొన్నారు. అసమ్మతి వాదులను మట్టి కరిపించడానికి సత్తాచాటేందుకు సిద్ధం కావాలని కోరారు. టిడిపి టిక్కెట్ నిరాకరించడంపై వారు మండిపడ్డారు. పార్టీ వద్దనుకున్నప్పుడు పార్టీలో ఎందుకుండాలని ప్రశ్నించారు. లక్ష్మీదేవి ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. సమావేశంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, పార్టీ నాయకులు ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, కొర్ను నాగార్జున, ఎస్.వి.రమణ మాదిగ, రాజు, జామి భీమశంకరరావు, సింతు సుధాకర్, వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటరమణ

ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా

మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ

కొత్తూరు: కార్యకర్తలే నా బలమని, వారు ఆదరిస్తే ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగుతానని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ స్పష్టం చేశారు. మండలంలోని నివగాంలోని పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల కార్యకర్తలతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఐదేళ్లూ ఏ తప్పు చేయలేదని పేర్కొన్నారు. టిక్కెట్ ప్రకటించే ముందుకు అధిష్టానం నాకు సమాచారం ఇవ్వలేదని అన్నారు. ఇది జిల్లా రాజకీయంలో ముఖ్య నాయకులు చేసిన పనేనని పరోక్షంగా అచ్చెన్నాయుడు ఉద్దేశించి వాఖ్యానించారు. బిజెపితో పొత్తు పెట్టుకోవడం వల్ల ఎంపీ గెలుస్తే కేంద్ర మంత్రి అవుతారని, ఒకే కుటుంబంలో రెండు పదవులు ఇవ్వరు కాబట్టి ఎంపీని ఓడించడానికి చేసిన వ్యూహమేనని ఆరోపించారు. ఇప్పటికైనా అధిష్టానం గుర్తించి బి.ఫారం నాకు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. అనంతరం కార్యకర్తలతో సుదీర్ఘంగా చర్చించారు. కలమట సాగర్, హిరమండలం జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బుచ్చిబాబు, మాజీ ఎంపిపి నారాయణరావు, పి.మోహనరావు, ఎ.అరుణ్‌కుమార్, శివ్వాల తేజేవ్వరరావు, పైల అచ్చుమయ్య పాల్గొన్నారు.

బిసిలపై వైసిపి కక్షసాధింపు

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస



రవికుమార్

బిసిలపై వైసిపి సాక్ష సాధింపులకు పాల్పడుతుందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆరోపించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 'నా ఎస్‌సి, నా ఎస్‌టి, నా బిసి' అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలే తప్ప చేసింది శూన్యమని అన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా కడప జిల్లాలోని రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరానికి చెందిన ఓ చేనేత కుటుంబం వైసిపి నాయకుల భూకబ్జా దాహానికి బలైపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల అణచివేతతో రాష్ట్రంలో భూ దందాలు సాగిస్తూ ఎసి, ఎస్‌టి, బిసిలకు చెందిన ఎన్నో కుటుంబాలను వైసిపి నాయకులు హతమార్చినా కనీస చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని గ్రహం వ్యక్తం చేశారు. గతంలో కడప జిల్లాలో నందం సుబ్బయ్య అనే పద్మశాలి నేతను అత్యంత కిరాతకంగా చంపేశారని, ఇప్పటికీ నిందితులపై చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇప్పుడు మరో దారుణానికి ఒడిగట్టారని తెలిపారు. జగన్‌రెడ్డి పాలనలో బడుగు, బలహీన వర్గాల ఆస్తులకు రక్షణ లేదన్న విషయం చేనేత కుటుంబం బలవన్మరణంతో మరోసారి రుజువయ్యిందని అన్నారు. ఇప్పటికైనా బిసిలపై దమనకాండను ఆపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బిసిల ద్రోహుల పార్టీగా వైసిపి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ అరాచక పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

ఎచ్చెర్ల బిజెపి అభ్యర్థిగా 'ఎన్ఇఆర్'!

ప్రజాశక్తి- రణస్థలం రూరల్



బిజెపితో టిడిపి పొత్తులో భాగంగా ఎచ్చెర్ల అసెంబ్లీ సీట్‌ను బిజెపి నాయకులు నడుకుదిటి ఈశ్వరరావుకు కేటాయించనున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన ప్రకటన నేడో, రేపో విడుదల చేసే అవకాశం ఉంది. 2019 సాధారణ ఎన్నికల తరువాత టిడిపి నుంచి బిజెపిలోకి చేరారు. ప్రస్తుతం బిజెపి విజయనగరం పార్లమెంటరీ జిల్లా అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెంకు చెందిన వారు.

'లోతుగెడ్డ' నిర్ణయానికి కట్టుబడి ఉంటాం

కొత్తూరు: వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తామని కార్యకర్తలు స్పష్టం చేశారు. స్థానిక చిట్టిబాబు కళ్యాణ మండపంలో ఆదివారం మండల స్థాయి కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. తులసీవరప్రసాదరావుకు వైసిపిలో జరిగిన అన్యాయానికి ముక్తకంఠంతో ఖండిస్తున్నామని అన్నారు. స్థానికుల అభిప్రాయానికి గౌరవం ఇవ్వని పార్టీలకు బుద్ధిచెబుతామని హెచ్చరించారు. రెండున్నర దశాబ్దాలుగా క్రియాశీలక రాజకీయాల్లో ఉంటూ పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి వంచన లేకుండా కృషి చేసిన తులసీవరప్రసాదరావుకు సంఘీభావం తెలిపారు. అలాగే తమ ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేస్తే... ఆయన వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. లోతుగెడ్డ నిర్ణయం మేరకే తమ భవిష్యత్ కార్యాచరణ, ప్రణాళిక ఉంటుందని తెలియజేశారు. తామంతా స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించి ఇష్టపూర్వకంగా సంతకాలతో తీర్మానించారు. అనంతరం తులసీవప్రసాదరావు మాట్లాడుతూ వైసిపిలో కొనసాగాలన్నా... పార్టీ మారాలన్నా... అవసరమైతే ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలన్నా కార్యకర్తల అభిప్రాయం తీసు కుంటానని అన్నారు. కార్యకర్తలు అభిప్రాయం ప్రకారం నా నిర్ణయం ఉంటుందని తేల్చిచెప్పారు. వైసిపి మాజీ మండల అధ్యక్షులు లోతుగెడ్డ తాతబాబు, ఎంపిటిసి అగతముడి సుశీల, పొడ్డిని సింహాచలం, బిర్లంగి కృష్ణవేణి, మెండ సుమతీ, చింతాడ శ్రావణి, సర్పంచ్‌లు శ్రీనివాసరావు, నిమ్మక కళావతి, అగుతుముడి రంజిత్‌కుమార్, అప్పారావు, శిమ్మ మధు, సనపల కోటి, షణ్ముఖరావు, మజ్జి భుజంగరావు, పారసిల్లి ఢిల్లేశ్వరరావు, శ్రీకరున, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తులసీవరప్రసాదరావు

ఎన్నికల కోడ్ ఉన్నా.. జగనన్న స్టిక్కర్లే

- ఆగని ఇసుక తవ్వకాలు
- అధికారుల పర్యవేక్షణ కరువు


ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని వంశధార నదీ పరివాహక ప్రాంతమైన చవ్వాకులపేట వద్ద జరుగుతున్న ఇసుక తవ్వకాలకు హద్దూ, అదుపు లేదు. ఇష్టానుసారం తోడేసి తరలించకపోతున్నారని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా ఇసుక ర్యాంపు నుంచి రోజూ విశాఖపట్నానికి వందల సంఖ్యలో భారీ వాహనాలు ఇసుక రవాణా చేయడంపై గ్రామీణ రహదారులు అధ్వానస్థితికి చేరుకోవడంతో పలు గ్రామాల ప్రజలు నిరసనలు తెలుపుతున్నారు. రాత్రి, పగలు అని తేడా లేకుండా రవాణా అవుతుండడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అయినా జిల్లా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నది నుంచి ఇసుకను వేరే ప్రాంతంలో ఇసుక డిపో కేంద్రం ఏర్పాటు చేసి అక్కడి నుంచి ఇసుక రవాణా చేసి విక్రయాలు జరపాలన్న నిబంధనలు ఉంది. అటువంటి నిబంధనలను బుట్టదాఖలు చేసి రాత్రి వేళలో కూడా నేరుగా వంశధార నదిలోనికి భారీ వాహనాలను తీసుకువెళ్లి యంత్రాలతో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు జరిపి తరలించుకుపోతున్నారు. జిల్లా, మండల అధికారులు ఏ ఒక్కరూ కనీస పర్యవేక్షణ చేయకపోవడంతో నదీ పరివాహక ప్రాంత ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నిబంధనలు ఉన్నా ఇసుక తరలిస్తున్న వాహనాలపై సిఎం జగన్మోహన్‌రెడ్డి స్టిక్కర్లను వాహనాల అద్దాలపై అతికించి యథేచ్ఛగా ఇసుక రవాణా జరుపుతున్నారు. అంతేకాకుండా ఇసుక లోడింగ్ ప్రాంతం నుంచి వాహనాలపై పరదాలు మూసివేసి రవాణా చేయాలన్న ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ కాంట్రాక్టర్లు వాటిని పాటించకుండా ఇసుకను తరలిస్తున్నారు. ప్రధాన రహదారులపై లారీలు వెళ్తున్న సమయంలో ఇసుక లారీ వెనుక వెళున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల పరిధిలో చవ్వాకులపేట ఉండగా నదికి అవతల వైపు నరసన్నపేట మండలం నదీ పరివాహక ప్రాంతం ఉంటుంది. అయితే ప్రతిమ ఏజెన్సీ ద్వారా ఇసుక తవ్వకాలు జరుపుతున్న సంస్థ మండలాలే కాకుండా జిల్లాల సరిహద్దులను దాటి నదిని గుల్ల చేసినప్పటికీ చర్యలు తీసుకునే అధికారులు కరువయ్యారు. తమకు ఎదురులేరన్న ధీమాతో భారీ యంత్రాలతో తవ్వకాలు జరుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసుక తరలిస్తున్న ప్రాంతంలో బరువు, పరిమాణం నిర్ధారించి అనుమతి పత్రాలు ఇవ్వాల్సి ఉంది. ఈ ప్రాంతంలో బరువు నిర్ధారించే యంత్రం కూడా మరమ్మతులకు గురైంది. దీంతో ఎటువంటి బరువు నిర్ధారణ లేకుండానే అధిక బరువులతో ఇసుక లారీలు గ్రామీణ రహదారులపై ప్రయాణిస్తున్నాయి. దీనివల్ల బిటి రోడ్డు సాధారణ గ్రావెల్ రోడ్డుగా మారిపోయాయి. దీనిపై పరిసర గ్రామస్తులు పలుమార్లు ఇసుక లారీలను అడ్డుకున్న సందర్భాలు ఉన్నాయి. లారీలను అడ్డుకున్న సమయంలో ఆమదాలవలస పోలీసులు ప్రత్యక్షమై ఇసుక తవ్వక నిర్వాహకులకు, గ్రామస్తులకు సర్ధిచెప్పి మరోసారి ఇటువంటి తప్పులు జరగవని ర్యాంపు నిర్వాహకులతో గ్రామస్తులకు చెప్పిస్తున్నారు. మళ్లీ మరుసటి రోజు నుంచి యథావిధిగా ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణాలు జరుపుకోవడం ఈ ప్రాంతంలో ఆనవాయితీగా మారిందని వాపోతున్నారు.





లారీలను ఇసుకతో లోడ్ చేస్తున్న ప్రొక్లెయిన్ (ఇన్‌సెట్‌లో) జగనన్న స్టిక్కర్‌తో రవాణా అవుతున్న ఇసుక లారీలు



పార్టీలో చేరిన వారితో మంత్రి అప్పలరాజు

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పలాస

మండలం శాసనం గ్రామానికి చెందిన యువత మంత్రి కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో వైసిపిలో చేరారు. మంత్రి అప్పలరాజు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసిపిలో చేరామని తెలిపారు. పార్టీలో చేరిన వారికి మంత్రి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో యువజన నాయకులు రాకేష్ రెడ్డి, విక్కీ, సంతోష్, హరీష్, సురేష్, కుమార్, గణేష్ పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న సురేష్‌కుమార్

జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో సత్తా చాటాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాజమండిలోని జిఎస్ఎల్ మెడికల్ కళాశాల వేదికగా ఈ నెల 25 నుంచి 28 వరకూ మూడు రోజుల పాటు జరుగనున్న జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొంటున్న క్రీడాకారులు సత్తాచాటాలని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని సురేష్ కుమార్ పిలుపు నిచ్చారు. శ్రీకాకుళం నుంచి జాతీయ స్థాయి పోటీలకు బయలు దేరిన క్రీడాకారులను టౌన్ హాల్‌లో ఆదివారం అభినందించారు. విజయనగరంలో గతేడాది డిసెంబరు 8 నుంచి 10 వరకు జరిగిన అండర్-14 విభాగం పదో సబ్ జూనియర్ పోటీలో జిల్లాకి చెందిన ఫెన్సింగ్ క్రీడాకారులు ఎన్.వెంకట సూర్య (ఫాయిల్), ఎస్.గాయత్రి (ఫాయిల్)లు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీకి ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఫెన్సింగ్ కోచ్ జోగిపాటి వంశీ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న న్యాయవాదులు

పురుషోత్తం నాయుడికి సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన చౌదరి పురుషోత్తం నాయుడును బిసి న్యాయవాదులు సంఘం ప్రతినిధులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగిగానే కాక ఉద్యోగుల సంఘానికి క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎదగడం శుభ పరిణామని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ఎపి బిసి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఆగూరు ఉమామహేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావులు కొనియాడారు. నగరంలోని ఆయన స్వగృహంలో కలసుకుని పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బి.వి.రమణ, పైడి జోగారావు పాల్గొన్నారు.



పలాస : సమావేశంలో మాట్లాడుతున్న వీరాస్వామి

వారి త్యాగం చిరస్మరణీయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశసేవలో ప్రాణాలర్పించిన త్యాగమూర్తులు భగత్ సింగ్, రాజ్‌గురు సుఖదేవ్‌లని, వారిని స్ఫూర్తిగా తీసుకొని హక్కుల కోసం ప్రతి విద్యార్థీ పోరాడాలని బిసి బాలికల వసతిగృహం సంక్షేమాధికారి చంద్రకళ పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నగరంలోని బిసి బాలికల వసతిగృహంలో ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 93వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన దీరోదాత్తులని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హాస్టల్ కమిటీ సభ్యులు పవిత్ర, రాణీమోహిని, సుస్మిత పాల్గొన్నారు.

పలాస: మండలం మాకన్నపల్లి, బొడ్డుపాడులో దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. మాకన్నపల్లి నుంచి బొడ్డుపాడు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీ నాయకులు దున్న గోవిందరావు, తెప్పల అజయ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న అన్ని హింసలకు వ్యతిరేకంగా పౌర ప్రజాస్వామ్య హక్కులు కోసం ప్రతిఒక్కరూ కలిసి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం రాష్ట్ర నాయకులు సాలిని వీరాస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పి.దానేష్, అరుణ, నాగమణి, చిరంజీవి, కుమార్, పౌర హక్కుల సంఘం ప్రజా కళామండలి ఉత్తరాంధ్ర మహిళా సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు స్వస్తి పలకాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గ ప్రజలు కుటుంబ పాలనకు స్వస్తి పలకాలని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. ఆదివారం పురపాలక సంఘ పరిధిలోని రెండో వార్డు కృష్ణాపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఓటు వేసి గెలిపించి మామ, అల్లుళ్లకు బుద్ధి చెప్పాలన్నారు. పురపాలక సంఘం పాలకవర్గం గడువు ముగిసినప్పటికి ఎన్నికలు జరగనివ్వకుండా ఇరు పార్టీలకు చెందిన మామ, అల్లుళ్ల అడ్డుకొన్నారని దుయ్యబట్టారు. మున్సిపాలిటీ ప్రజలను అభివృద్ధికి దూరం చేసి ప్రజా ధనాన్ని దోచుకున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడతానన్నారు. కార్యక్రమంలో నాయకులు సువ్వారి అనిల్, పేడాడ వైకుంఠరావు, కూన గోపి, సాయికుమార్, సూర్యారావు, ప్రసాద్, ఎండ అప్పలనాయుడు, పాపారావు, శ్రీను పాల్గొన్నారు.



ఇంటింటా ప్రచారం చేస్తున్న గాంధీ

శిల్పకళకు ప్రతిరూపం వేణుగోపాలస్వామి ఆలయం

నేటి నుంచి డోలోత్సవాలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

భారత దేశంలో ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో మన జిల్లాలో మెళియాపుట్టి మండల కేంద్రంలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయం ఒకటి. 1840లో పర్లాకిమిడి (ఒరిస్సా) మహారాజు వీరేంద్ర ప్రతాపరుద్రుడు తన భార్య విష్ణుప్రియ కోరిక మేరకు ఈ ఆలయాన్ని నిర్మించారు. గర్భాలయంలో కంచుతో తయారు చేయబడిన విగ్రహాలను రాధా, గోవిందుడు చెలికత్తె లలితాంబలుగా భక్తులు కొలుస్తారు. పర్లాకిమిడి నగరానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న మహేంద్రతనయ నదీతీరాన మెళియాపుట్టి గ్రామంలో ఈ ఆలయ నిర్మాణాన్ని నిర్మించారు. మహారాణి తల్లిదండ్రులు పసుపు, కుంకుమలు నిమిత్తం ఇచ్చిన ఆభరణాలతో పాటు లక్ష రూపాయలు వెచ్చించి ఆమె పేరున ఈ ఆలయాన్ని నిర్మించారు. గర్భగుడిలో ప్రతిష్ఠించిన మూలవిరాట్ విగ్రహాలను బృందావనం నుంచి తెప్పించినట్లు ఇప్పటికీ ఆ కాలం నాటి వ్యక్తులు చెబుతూ ఉంటారు. కానీ ఆ విగ్రహాలు ప్రస్తుతం దొంగిలించ బడ్డాయి.

సొరంగ మార్గం

ఆలయం నుంచి పర్లాకిమిడి బృందావన్ ప్యాలెస్‌గా



డోలోత్సవానికి సిద్ధమైన ఆలయం

పిలువబడే పర్లాకిమిడి రాజుల ఉద్యానవనానికి స్వరంగ మార్గం కూడా ఉండేదని, ఇక్కడి నుంచి బంగారు నాణేలు, మెళియాపుట్టిలో పండే ఫలసాయం, ఇతర వస్తువులు ఆ సొరంగ మార్గం ద్వారా పర్లాకిమిడి రాజుగారి కోటకు చేరవేసేవారని పలువురు చెబుతున్నారు. ఇప్పటికీ ఆ సొరంగ మార్గం ఉన్నట్లుగా చెబుతున్నారు.

శిథిలావస్థలో ఆలయం

ప్రస్తుతం ఆలయ చుట్టుప్రక్కల ఉన్న రాతి ప్రహరీ, గదులన్నీ శిథిలావస్థలో ఉన్నాయి. గతంలో ఇక్కడ శుభకార్యాలు చేసేటప్పుడు ఆ గదుల్లో సామాగ్రితో పాటు ప్రజలు కూడా సేదతీరేవారు. ప్రస్తుతం శిథిలావస్థలో ఉండటంతో గదులు అధ్వాహ్నంగా తయారయ్యాయి. అయితే దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ అభివృద్ధికి తోడ్పడి, ఆలయం పూర్తిగా శిథిలం కాకముందే అభివృద్ధి పనులు చేయించాలని మండల వాసులు కోరుతున్నారు.

ఏటా ఘనంగా డోలోత్సవాలు

స్వామివారి డోలోత్సవాలు ప్రతియేటా ఘనంగా జరుపుతారు. ఈనెల 25న డోలోత్సవం జాతర ప్రారంభం కానుంది. ఇందులో ముఖ్యమైనది మఘా కార్యక్రమం. డోలోత్సవాలు ప్రారంభమయ్యే ముందురోజు పెద్దసంఖ్యలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి స్వామివారిని మెళియాపుట్టి పురవీధుల్లో ఊరేగించి ప్రతి ఇంటి హారతిని స్వామివారికి అందించి, రాత్రి అర్ధ భాగం సమయంలో గ్రామ శివార్లలో పెద్ద మంట వేసి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి రాజవంశస్థులు ఎవరైనా ఒకరు హాజరవుతారు. ఈ సాంప్రదాయం చాలా ఏళ్ళ నుంచి కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రతి ఏడాది మార్చి నెలలో ఈ డోలోత్సవాలు చేస్తున్నారు. ఇప్పుడు అనేక రకాల పౌరాణిక నాటకాలు, బుర్రకథలు నిర్వహిస్తూ అంగరంగ వైభవంగా చేస్తున్నారు. యాత్ర జరిగే తొమ్మిది రోజుల్లో స్వామివారిని 3 రోజులు ఉయ్యాల మండపానికి తీసుకువచ్చి విడిది ఏర్పాటు చేస్తారు.



ఇచ్ఛాపురం : ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

వైసిపి ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుకోవాలని జెడ్‌పి చైర్‌పర్సన్, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ అన్నారు. ఆదివారం మండలంలోని మశాకపురంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ కూలీలతో సమావేశమై గ్రామాల్లో అభివృద్ధి చూసి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, దున్న గురుమూర్తి, జెసిఎస్ కన్వీనర్ చిట్టిబాబు, మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్ రెడ్డి, మండల జెసిఎస్ అధ్యక్షులు ఆశి పురుషోత్తం పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండల జెసిఎస్ కన్వీనర్ వడ్డీ కరుణాకర్ ఆధ్వర్యంలో డోకులపాడు పంచాయతీలో వైసిపి నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సీదిరి అప్పలరాజు, పార్లమెంట్ అభ్యర్థి పేరాడ తిలక్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జులు దువ్వాడ మధుకేశవరావు, ఇరోతు హేమంత రాజు, ఎంపిటిసి ఢిల్లేశ్వర్, మత్స్యకార సొసైటీ అధ్యక్షులు పాపారావు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలం సౌడాం పంచాయతీలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు వైసిపి నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం



వజ్రపుకొత్తూరు : ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

నిర్వహించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, సచివాలయ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, మండల విప్ బొడ్డు అప్పన్న, వైసిపి నాయకులు కవిటి రామరాజు, మెట్ట సింహాచలం పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు



విజేతకు షీల్డు అందజేస్తున్న వైస్ ప్రిన్సిపాల్, పిఒ



నరసన్నపేట : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాదరావు

ప్రజాశక్తి- నరసన్నపేట

స్థానిక ఎల్‌విఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సత్యవరంలో ప్రత్యేక శిక్షణా శిబిరం ఆదివారంతో ముగిసింది. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవలో కూడా ముందుండాలని, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు తోటి విద్యార్థులకు సామాజిక సేవ పట్ల అవగాహన కల్పించాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసాదరావు అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పిఒ పోగోటి మోహనరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మూడవ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వారం రోజులుగా మండలంలోని ధర్మ నీలాపురంలో నిర్వహించిన సేవా శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా పలు క్రీడాపోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ, పిఒ డి.వాసుబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్ కుమార్, గ్రామస్తులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలం గురండి, పాతపాడు గ్రామాల్లో వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన సేవా కార్యక్రమాలు నేటితో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో సర్పంచ్ బి.సింహాద్రి నాయుడు, కళాశాల డైరెక్టర్ జి.కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎస్.శ్రీనివాసరావు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

బోరుభద్ర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి విద్యుత్ శాఖ ఇఇ ఈశ్వరరావు, సంత బొమ్మాళి ఎఇ మెట్ట శివ కుమార్ తెలిపారు. పిన్నింటిపేట సబ్‌స్టేషన్‌లో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నందున పిన్నింటిపేట నుంచి వస్తున్న 33 కెవి ఫీడర్ నిలిపివేస్తున్నందున బోరుభద్ర సబ్‌స్టేషన్‌కు విద్యుత్ ఉండదన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అచ్చెన్న ముందస్తు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- టెక్కలి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు భారీ కేకును కట్ చేసి అచ్చెన్నాయుడుకు తినిపించారు. మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు, పినకాన అజయ్ కుమార్, జీర్ భీమారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు హనుమంతు రామకృష్ణ, మెంద దమయంతి, చాపర గణపతి, మామిడి రాము పాల్గొన్నారు.

నందిగాం: రాష్ట్ర టిడిపి అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు ముందస్తుగా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కేకును కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు హరివరప్రసాద్, టిడిపి నాయకులు పి.అజయ్ కుమార్, బగాది శేషగిరిరావు, ఎం.బాలకృష్ణ, ప్రసాదరావు ఉన్నారు.

వైసిపిని గద్దె దించే సమయం ఆసన్నమైంది

ప్రజాశక్తి- పాతపట్నం

బడుగు, బలహీన వర్గాలు ఏకమై అరాచక వైసిపి పాలనను గద్దెదించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. హిరమండలం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఒంటిమిట్ట చేనేత కుటుంబం బలవన్మరణంపై తీవ్రంగా ఖండించారు. వైసిపి పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రాణాలతో పాటు ఆస్థులకు రక్షణ కరువైందని ఇందుకు కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంకు చెందిన చేనేత కార్మిక కుటుంబం బలవన్మరనాలే నిదర్శనమన్నారు. ఈ అరాచక పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

60 మంది రక్తదానం

శ్రీకాకుళం అర్బన్ : సినీనటుడు రామ్‌చరణ్ అభిమానులు నగరంలో జన్మదిన వారోత్సవాల పేరిట ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. నగరంలోని న్యూబ్లడ్‌బ్యాంకులో నిర్వహించిన ఈ శిబిరాన్ని చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను, వైశ్యరాజు మోహన్‌తో కలిసి ప్రారంభించారు. మెగా కుటుంబ నేపథ్యం ఉన్న హీరోల అభిమానులు వారి జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమాలను నిర్వహించి వారి అభిమానాన్ని చాటుకోవడం కొన్నేళ్లుగా జరుగుతోందని, అందులో భాగంగానే రామ్‌చరణ్ జన్మదిన వేడుకలను సైతం ఘనంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ మేరకు 60 మంది యువకులు ఈ శిబిరంలో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో న్యూబ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ, రామ్‌చరణ్ యువశక్తి సభ్యులు మజ్జి గౌతమ్, సిద్ధూ, కళ్యాణ్, బాలాజీ, గణసాయి, మదన్, గోవింద్, హేమంత్‌రెడ్డి, దినేష్, విజయ్ పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'పై ప్రచారం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలో మెట్టక్కివలస ప్రాంతాలలో ఆదివారం టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ బిజెపి కన్వీనర్ పేడాడ సూరపనాయుడు, జనసేన కన్వీనర్ పేడాడ రామ్మోహనరావు ఆధ్వర్యంలో శంఖారావం సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని పదవ వార్డులో వైసిపికి చెందిన 25 కుటుంబాలు టిడిపిలో చేరారు. గాంధీనగర్‌కు చెందిన 20 కుటుంబాలు, 9వ వార్డు నుంచి 22 కుటుంబాలు, 11వ వార్డులో 25 కుటుంబాలు, పంతులుపేటకు 30 కుటుంబాలు అక్కివలసకు చెందిన 40 కుటుంబాలు, మండలంలోని గాజుల కొల్లివలస, శ్రీహరిపురం గ్రామాలకు చెందిన ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు లోపింటి నారాయణరావు మాదిగ తో పాటు 50 మంది మాదిగ యువకులు టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి రవికుమార్‌తో పాటు జనసేన, బిజెపి నాయకులు టిడిపి



టిడిపిలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న రవికుమార్

కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నూతనంగా పార్టీలోకి చేరిన 200 మందితో కలిసి శంఖారావం సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా జనసేన సీనియర్ నాయకులు పాత్రుని పాపారావు, పైడి మురళీమోహన్, టిడిపి నాయకులు నూకరాజు, బోర గోవిందరావు, ఎన్ని శ్రీదేవి, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీతాసాగర్, మొదలవలస రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న త్రినాధరావు

కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యం

ప్రజాశక్తి- పలాస

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో ఎన్ని పార్టీలు బరిలో ఉన్నా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తన విజయం తథ్యమని మజ్జి త్రినాధరావు జోస్యం చెప్పారు. స్థానిక టికెఆర్ ఫంక్షన్ హాల్‌లో డాక్టర్ జీవితేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన మజ్జి ఆత్మీయ సమ్మేళన సభలో త్రినాధబాబు మాట్లాడుతూ తన తండ్రి మజ్జి తులసీదాస్ ఎంతో మంది సీనియర్ కాంగ్రెస్ నాయకులతో పనిచేసి మంత్రిగా, ఎమ్మెల్యేగా ఈ ప్రాంతంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. తనను గెలిపిస్తే ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని, ప్రతి పరిశ్రమతో తమకు సంబంధాలున్నాయన్నారు. ఉపాధి కల్పించని నాడు మరోమారు పోటీలో ఉండనన్నారు. వ్యవసాయ రంగంలో దిగుబడి పెరిగి పంటకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర ప్రాంతాల్లో వ్యవసాయం చేస్తున్న వారు ఎంతోమంది ధనికులుగా మారారని, మన ప్రాంతంలో మాత్రం ఆకాశం వైపు చూస్తు ఆ రంగాన్నే విడిచిపెట్టడం బాధకరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బేసి శ్యామసుందర్, పైడి పట్టాబి, హైమారావు చౌదరి, మాదిన రామారావు, బమ్మిడి ఎర్రయ్య, కెపి రామన్న, బమ్మిడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టిడిపి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టిడిపి అధికారంలోకి వస్తేనే యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, టెక్కలి నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షులు పూజారి శైలజ అన్నారు. ఆదివారం పొడుగుపాడులో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ దృష్ట్యా టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రజలు సహకరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా



కార్యకర్తలతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీగా కింజరాపు రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొండు లక్ష్మణరావు, నంబాళ శ్రీనివాస్, సాసుమంతు ఆనందరావు, బెండి అన్నపూర్ణ, శ్రీనువాస్, బాడాన రమణమ్మ పాల్గొన్నారు.

స్నేహితురాలికి అండ



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్ర బృందం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న స్నేహితురాలిని 7వ తరగతి 1986 బ్యాచ్ ఆర్థికసాయం అందించి మేమున్నామని భరోసా ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తమ చిన్ననాటి స్నేహితురాలు డబ్బీరు పుణ్యావతికి మిత్ర బృందం తమవంతు సహకారంగా రూ.20 వేలు వైద్యఖర్చుల నిమిత్తం ఆదివారం ఆమె ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో గోపి, శ్రీను, వెంకట రమణ, యోగి, జయ, జన తదితరులున్నారు.



మద్యం బాటిళ్లు, నిందితుడుతో ఎస్ఐ

ఆరు మద్యం సీసాలు స్వాధీనం

మెళియాపుట్టి: మండలంలో పట్టుపురం వద్ద ఆదివారం ఎన్నికల ఎస్ఎఫ్‌టి టీం తనిఖీల్లో ఆరు మద్యం బాటిళ్ల పట్టుకున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఒడిశాకు చెందిన జగన్నాథ బెహరా, బలరాం బెహరాలు ఆరు మద్యం బాటిళ్లతో గారబంద నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా పట్టుపురం వద్ద తనిఖీల్లో పట్టుబడ్డారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు.



మద్యం దుకాణం వద్ద క్యూలైన్‌లో ఉన్న మందుబాబులు

మద్యం దుకాణంతో అవస్థలు

బూర్జ: మండలం కొల్లివలస గ్రామ కూడలి వద్ద ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణంతో స్థానిక ప్రజలు, మహిళలు అవస్థలకు గురవుతున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణం కొల్లివలస జంక్షన్ వద్ద ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం ఎన్నికల సమయంలో మందు బాబులు దుకాణం వద్ద బారులు తీరుతున్నారు. ముఖ్యంగా మద్యం దుకాణం సమయపాలన పాటించక పోవడంతో మందుబాబులు ఈ ప్రాంతంలో గుమిగూడి ఉంటున్నారని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారని, మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించేందుకు చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



వీధుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఎన్‌టిఆర్ కాలనీలో కార్డాన్ సెర్చ్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలిలో ఆదివారం వేకువజామున పోలీసులు కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఎన్‌టిఆర్ కాలనీలో పలువీధుల్లో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. సిఐ పి.పైడయ్య ఆధ్వర్యంలో పలువురు ఎస్ఐలు, సిబ్బంది తనిఖీలు చేశారు. వాహనాల పత్రాలను పరిశీలించిన పోలీసులు సరైన పత్రాలు లేని పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అక్కుపల్లి మహాత్మా జ్యోతిభా పూలే బిసి మత్స్యకార బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.పాపారావు ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక ఉంటుందన్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు వైసిపి విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండల వైసిపి విస్తృతస్థాయి సమావేశం పార్టీ కార్యాలయ ఆవరణలో సోమవారం జరుగుతుందని వైసిపి మండల అధ్యక్షుడు పి.గురయ్యానాయుడు తెలిపారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌లు హాజరుకానున్నారని, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పలువురిని కలిసిన 'మామిడి'

ప్రజాశక్తి- కొత్తూరు

పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణను కలిసేందుకు పాతపట్నం టిడిపి అభ్యర్థి మామిడి గోవిందరావు వెళ్లారు. కలమట సాగర్ ఇక్కడ నుంచి వెళ్లిపొండని అనడంతో అక్కడ నుంచి వెనుతిరిగారు. అంతకుముందు మాజీ వైస్ ఎంపిపి, గురండి ఎంపిటిసి అగతముడి భైరాగినాయుడును కలిసి శాలువతో సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. అలాగే ఆకులతంపర సర్పంచ్ నాగళ్ల అప్పన్న, మదనాపురం మాజీ సర్పంచ్ అగతముడి మాధవరావులను కలిసి మద్దతివ్వాలని కోరారు. ఈయనతో పాటు టిడిపి మండల మాజీ అధ్యక్షులు ఎద్దు దాసునాయుడు, అరుబోలు దశరథ, బి.చక్రాధరరావు ఉన్నారు.

నేడు టిడిపి ర్యాలీ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ కోసంగిపురం జంక్షన్ నుంచి కెటి రోడ్డు మీదుగా మొగిలిపాడు జాతీయ రహదారి వరకు సోమవారం సాయంత్రం 3 గంటలకు టిడిపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. ర్యాలీలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష, ఎంపీ రామ్మోహన్ నాయుడు హాజరవుతున్నట్లు తెలిపారు. వారికి టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ఘనంగా స్వాగతం పలకాలని కోరారు.



కథలు చదువుతున్న విద్యార్థి

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు కథలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయం తరుపున విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమములో గ్రంథాలయ సహాయకులు టి. వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.